టెట్ ఫీజు తగ్గించండి

- ప్రభుత్వానికి అభ్యర్థుల వినతి
- మొదటిరోజు 1200 దరఖాస్తులు
- టెట్ రాసే టీచర్లకు అనుమతి అక్కర్లేదు : విద్యాశాఖ

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : పెంచిన టెట్ ఫీజులను వెంటనే తగ్గించాలని నిరుద్యోగులు, అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ ఫీజులను పెంచడమంటే నిరుద్యోగులకు అన్యాయం చేసినట్టేనని మండిపడ్డారు. టెట్ ఫీజులను తగ్గించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ఆధ్వర్యంలో నిరుద్యోగులు, అభ్యర్థులు బుధవారం టెట్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ... గతంలో టెట్ ఒక పేపర్‌కు రూ.200 ఫీజు ఉండగా దాన్ని వెయ్యికి.. రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు రూ.300గా ఉన్న ఫీజును ఏకంగా రెండువేలకు పెంచడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే కోచింగ్, శిక్షణ, హాస్టల్ ఫీజులకే వేలకు వేల రూపాయలు ఖర్చులతో ఇబ్బంది పడుతున్న అభ్యర్థులకు ఇది మరింత భారం కానున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా టెట్ ఒక్కో పేపర్ కి వెయ్యి రూపాయల ఫీజు చెల్లించాలనడం మూర్ఖత్వమేనని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని చెప్పి ఇప్పుడు మాట మార్చడం సరికాదని అన్నారు. టెట్ ఫీజు తగ్గించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నేతలు నాగేందర్, అవినాశ్, శ్రీకాంత్, రాకేశ్, క్రాంతి, జాన్, వంశీ ఉన్నారు.

తొలిరోజు 4,050 దరఖాస్తులు

టెట్‌కు తొలిరోజు కేవలం 4,050 దరఖాస్తులొచ్చాయి. మొదటి రోజు కావడంతో అభ్యర్థుల నుంచి స్పందన రాలేదు. ఫీజులు భారీగా పెంచడంతో అభ్యర్థులు దరఖాస్తు చేయాలా? లేదా? అన్న సందిగ్ధంలో ఉన్నారు. తొలిరోజు అభ్యర్థులు సాంకేతికలోపం, వెబ్‌సైట్ మొరాయించడంతో దరఖాస్తు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. చివరికి సాంకేతిక నిపుణులు.. వెబ్‌సైట్‌కు ముందు https‌కు బదులుగా http అని చేయడంతో ఇలా జరుగుతున్నదని గుర్తించారు. వెబ్‌సైట్ పూర్తి అడ్రస్‌ను టైపు చేయాలని సూచించారు.

వెబ్‌సైట్ తప్పులమయం

టెట్ వెబ్‌సైట్‌లో పలు తప్పులతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొన్నది. దరఖాస్తుల్లో గతంలో టెట్ క్వాలిఫై అయిన వివరాలను నమోదుచేసుకునే అవకాశానిచ్చారు. ఈ వివరాల నమోదుకు ఇచ్చిన ఆప్షన్లల్లో కొన్ని తప్పులున్నాయి. టెట్ పరీక్షను 2017 డిసెంబర్‌లో జరిగినట్టుగా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇది శుద్ధతప్పు. టెట్ పరీక్షను 2017 జూలైలో నిర్వహించారు. కానీ వెబ్‌సైట్‌లో మాత్రం 2017 డిసెంబర్ అని పేర్కొన్నారు. దీంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొన్నది. ఇక 2016 మేలో టెట్‌ను నిర్వహించారు. కానీ 2016 వివరాలను వెబ్‌సైట్‌లో పేర్కొనలేదు. దీంతో ఈ టెట్ పరీక్షలో క్వాలిఫై అయిన వారు తమ మార్కులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొనే అవకాశాన్ని కోల్పోయారు.

టీచర్లకు అనుమతి అక్కర్లేదు : శ్రీదేవసేన

రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లు టెట్ రాయాలంటే అనుమతి పొందాల్సిన అవసరంలేదని విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. టీచర్లు టెట్ రాయాలంటే విద్యాశాఖ నుంచి అనుమతి తీసుకోవాలని టెట్ కన్వీనర్ రాధారెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పలు ఉపాధ్యాయ సంఘాలు దీనిపై అభ్యంతరం వ్యక్తంచేశాయి. దీంతో టెట్ రాసేందుకు టీచర్లుఅనుమతి తీసుకోవాల్సిన అక్కర్లేదని శ్రీదేవసేన స్పష్టంచేశారు.

ఎప్‌సెట్‌కు దరఖాస్తుల జోరు

- వారంలోనే పుంజుకొన్న అప్లికేషన్లు
- 27 వరకు 2.63 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : టీఎస్ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్) దరఖాస్తులు జోరందుకున్నాయి. వారం వ్యవధిలోనే మరింత పుంజుకున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలకు ముందు ఎప్‌సెట్ దరఖాస్తులు లక్షలోపే ఉండేవి. ఇంటర్ పరీక్షలు ముగియడంతో దరఖాస్తుల సంఖ్య అమాంతం పెరిగింది. ఈ నెల 18 వర కు 1.49 లక్షల దరఖాస్తులు రాగా, బుధవారం వరకు 2.63 లక్షల దరఖాస్తులు నమోదయ్యాయి. ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులంతా ఇప్పుడు ఎప్‌సెట్‌పై దృష్టిపెట్టారు. నిరుడు ఎప్‌సెట్‌కు రికార్డుస్థాయిలో 3,20,766 దరఖాస్తులొచ్చాయి. వీటిలో తెలంగాణ నుంచి 2.48 లక్షలు, ఏపీ నుంచి 77 వేల దరఖాస్తులు అందాయి. ఈ ఏడాది ఆలస్య రుసుముతో మే 1 వరకు దరఖాస్తు చేసే అవకాశం ఉన్నది.

దరఖాస్తుల నమోదు ఇలా..

తేదీ	దరఖాస్తులు
26-02-24	3,113
28-02-24	15,355
04-03-24	39,920
05-03-24	44,938
18-03-24	1,49,183
26-03-24	2,54,252
27-03-24	2,63,225

అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం

ఎప్‌సెట్‌కు పరీక్షాకేంద్రాలు సహా ఎలాంటి ఇబ్బందుల్లేవు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రభావంతో అక్కడక్కడ గతంలో ఉన్న సెంటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఇవి తప్ప మరే సమస్యల్లేవు. విద్యార్థులకు ఆందోళన అక్కర్లేదు. అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షలను సజావుగా నిర్వహిస్తాం.

– ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎప్‌సెట్ కోకన్వీనర్.

ఏపీలో సెంటర్ల కొరత..

ఎప్‌సెట్ పరీక్ష నిర్వహణకు ఏపీలో సెంటర్ల కొరత సమస్య తలెత్తింది. గుంటూరు, విజయవాడ, వైజాగ్‌లలో ఎప్‌సెట్ పరీక్షాకేంద్రాలను ఆయా నగరాల మధ్యలోని కాలేజీల్లోనే నిర్వహిస్తున్నారు. ఆ కాలేజీల్లోనే ఎన్నికల స్ట్రాంగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షాకేంద్రాల స్థానంలో కొత్తవాటిని వెతికే పనిలో అధికారులున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గానికో జిల్లా!?

- మళ్లీ తెరపైకి జిల్లాల విలీన అంశం
- సర్కారు జ్యుడీషియల్ కమిషన్ యోచన!
- మీడియాలో విస్తృత ప్రచారం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు జ్యుడీషియల్ కమిషన్ వేయాలని భావిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. ఆంధ్రప్రదేశ్ తరహాలో పార్లమెంట్ నియోజకవర్గాలను ప్రాతిపదికగా తీసుకోవాలని భావిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం గతంలో జిల్లాలను పునర్వ్యవస్థీకరిస్తామని వ్యాఖ్యానించారు. ఈ లెక్కన ప్రస్తుతం 33గా ఉన్న జిల్లాల సంఖ్య దాదాపు తగ్గిపోతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. రెండు, మూడు అటూ ఇటుగా 20 వరకు జిల్లాలు ఏర్పాటు చేయొచ్చని చర్చ జరుగుతున్నది. అంటే కనీసం 13-15 జిల్లాల విలీనం తప్పదన్నమాట. దీంతో కొత్త జిల్లాలు కేంద్రంగా సవ్యంగా సాగుతున్న పాలన మళ్లీ దెబ్బతింటుందన్న ఆందోళన మొదలైంది. ఏ జిల్లా ఉంటుంది? ఏ జిల్లా పోతుంది? అని ప్రజల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు జిల్లాల సంఖ్యను కుదిస్తే అనేక కొత్త సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమయం, డబ్బు వృథా అవడంతో పాటు ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజలకు నష్టం కలుగుతుందని స్పష్టం చేస్తున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం ప్రతిపాదికన ఒక్కో జిల్లా చేస్తే.. 2026లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నదని, మరి అప్పుడు కూడా మళ్లీ కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలు తగ్గిస్తే కలెక్టర్ పోస్టులు మొదలు అన్ని శాఖల జిల్లా స్థాయి హెచ్‌వోడీలు, ఆయా కార్యాలయాల్లో పనిచేసే అటెండర్ల వరకు అన్ని పోస్టులు రద్దు అవుతాయని చెప్తున్నారు. ఫలితంగా ఉన్నతాధికారుల సంఖ్య భారీగా పడిపోతుందని అంటున్నారు. ఇప్పుడు పదోన్నతులు వేగంగా వస్తున్నాయని, జిల్లాల సంఖ్య తగ్గితే ఆలస్యం అవుతాయని వెల్లడిస్తున్నారు. జిల్లాల ఏర్పాటుతో జోన్ల విభజన కూడా జరగాలని, ఇవన్నీ అధికారికంగా అమల్లోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి అనుమతి కావాల్సి ఉంటుందని, ఇది పూర్తి కావడానికి కనీసం ఒకటి, రెండేండ్లు పడుతుందని స్పష్టం చేస్తున్నారు. అప్పటివరకు ఎలాంటి నోటిఫికేషన్లు వేయడానికి ఆస్కారం ఉండదని, ఫలితంగా నిరుద్యోగులు నష్టపోతారని వివరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకేంద్రాల్లో నిర్మించిన భవనాలన్నీ వృథా అవుతాయని, జిల్లాల వారీగా పార్టీలు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అనుబంధ కమిటీలు ఇలా వందల మందికి పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాయి. వారంతా పదవులు కోల్పోయే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. మొత్తంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఆలోచనతో ప్రయోజనం దాదాపు శూన్యమని చర్చ జరుగుతున్నది.

తాగొచ్చిన టీచర్‌ను నిర్బంధించిన గ్రామస్థులు

- కొత్తగూడెం జిల్లా చర్ల మండలం జీపీపల్లి పాఠశాలలో ఘటన

చర్ల, మార్చి 27 : పాఠశాలకు తప్పతాగి రావడమేగాక విద్యార్థులను అకారణంగా కొట్టడంతో ఆగ్రహించిన గ్రామస్థులు ఉపాధ్యాయుడిని తరగతి గదిలో నిర్బంధించారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం జీపీ పల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం చోటుచేసుకున్నది. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేస్తున్న కిషన్ బుధవారం మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. మద్యం మత్తు లో విద్యార్థులను కొట్టడం మొదలుపెట్టాడు. విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు చేరడంతో వారు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిని నిలదీశారు. దురుసుగాచెప్పడంతో నిర్బంధించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ నేత వసంత తెలిపారు.

గ్రీన్ హైడ్రోజన్ తయారీపై ఐఐసీటీ పరిశోధనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): శిలాజ ఇంధన వనరుల వినియోగాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) కృషి చేస్తున్నది. క్లీన్ ఎనర్జీగా పేరున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై పరిశోధనలు ముమ్మరం చేసింది. అతి చౌకగా తయారు చేసే విధివిధానాలపై అధ్యయనం చేస్తున్నది. కోబాల్ట్ టెర్పైరిడిన్ రసాయన మూలాకాన్ని వినియోగించి వాణిజ్యపరంగా హైడ్రోజన్ ఉత్పత్తి చేసే విధానాన్ని ఐఐసీటీ పరిశోధకులు తెలుసుకుంటున్నారు.

- సిరిసిల్లలో నేతన్నల భిక్షాటన

కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై సిరిసిల్ల నేతన్నలు భగ్గుమంటున్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవడంలేదని మండిపడుతున్నారు. బుధవారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో వాడవాడలా భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ నిరసనలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ సిరిసిల్ల అధ్యక్షుడు సత్యం, నాయకులు కిషన్, రవి, నక్క దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

– రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ

కోటా దాటిన కోరిక!

నాగార్జునసాగర్ నుంచి కోటాకు మించి 5 టీఎంసీలు కావాలంటున్న ఏపీ

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఏప్రిల్‌లో ఏపీ తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ నుంచి 5 టీఎంసీల నీరు విడుదల చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు కుడికాలువ నిర్వహణ కోసం డ్యామ్‌పైకి ఏపీ అధికారులను అనుమతించేలా సీఆర్పీఎఫ్ అధికారులకు ఆదేశాలివ్వాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి తాజాగా ఓ లేఖ రాసింది. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశంపై చర్చించేందుకు గత అక్టోబర్‌లో సమావేశమైన త్రిసభ్య కమిటీ.. అప్పటికి అందుబాటులో ఉన్న జలాల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ రాష్ట్రం ఇప్పటికే శ్రీశైలం నుంచి 26.571, సాగర్ నుంచి 15.383 టీఎంసీలు కలిపి మొత్తం 41.954 టీఎంసీలను వినియోగించుకున్నది. సాగర్ కుడికాలువ ద్వారా ఇంకా 5 టీఎంసీలు ఇవ్వాలని తాజా లేఖలో ఏపీ కోరింది.

గోదావరి ప్రాజెక్టులపై పాటిల్ సమీక్ష

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): గోదావరి బేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల సమగ్ర సమాచారంపై రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆరా తీశారు. గోదావరి బేసిన్‌కు సంబంధించి ఇంటర్‌స్టేట్ అధికారులు, ప్రాజెక్టుల అధికారులతో బుధవారం జలసౌధలో పాటిల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల వివరాలను, విశిష్టతలను ఒక్కొక్కటిగా అడిగి తెలుసుకున్నారు. అంతరాష్ట్ర వివాదాలపై కూడా ఆరా తీశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం, ప్రాజెక్టు వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అధికారులు వెల్లడించిన ప్రతి అంశాన్ని పాటిల్ నోట్ చేసుకున్నారు. శుక్రవారం కృష్ణా బేసిన్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా భేటీ కావాలని ఆయన నిర్ణయించినట్టు తెలిసింది.

కలకత్తాకు ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా!

హైదరాబాద్, మార్చి27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణకు ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ జడ్జి పీసీ ఘోష్‌ను కలిసేందుకు ఇరిగేషన్‌శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా పశ్చిమ బెంగాల్‌కు వెళ్లనున్నారని విశ్వసనీయ సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైన్, నిర్మాణ లోపాలు, కాంట్రాక్టుల అప్పగింత తదితర అంశాలపై విచారించి నివేదికను అందజేయాలని జస్టిస్ పీసీ ఘోష్‌కు మార్గదర్శకాలు జారీచేశారు. ఆయా అంశాలపై చర్చించేందుకు, అందుకు సంబంధించిన సమాచారాన్ని అందజేసేందుకు రాహుల్ బొజ్జా కలకత్తా వెళ్లనున్నారని తెలిసింది.

గురుకుల కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి27 (నమస్తే తెలంగాణ): బీసీ గురుకుల డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 12లోపు దరఖాస్తు చేసుకోవాలని బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి సైదులు తెలిపారు. అభ్యర్థుల ఎంపికకు ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు https://mjptbcwreis.telangana.gov.in/contact వెబ్‌సైట్ లేదా 040- 23828266 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్ఐవోఎస్ వారికి డీఎస్సీ అవకాశం లేనట్టే

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : నేషనల్ ఓపెన్ స్కూల్‌లో డీఈఎల్ఈడీ పూర్తిచేసిన వారికి డీఎస్సీ అవకాశం చేజారినట్టే. ఓడీఎల్ (ఓపెన్ డిస్టన్స్ లెర్నింగ్) విధానంలో ఈ కోర్సును పూర్తిచేసిన వారికి అవకాశం లేనట్టే. ఇటీవలే రాష్ట్రంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రాథమిక స్థాయిలో బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు రెగ్యులర్‌గా డీఎడ్/డీఈఎల్ఈడీ పూర్తిచేసిన వారే అర్హులు. అయితే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్లో(ఎన్ఐవోఎస్) ఓడీఎల్ విధానంలో డీఈఎల్ఈడీ కోర్సులు రెగ్యులర్ కోర్సులతో సమానం కాదని గత నవంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును తాజా మెగా డీఎస్సీలో అమలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎవరైనా అలాంటి వారు దరఖాస్తు చేస్తే వాటిని పక్కనపెట్టాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది.

జేఎల్ ఫలితాలు విడుదల చేయండి

టీఎస్‌పీఎస్సీకి అభ్యర్థుల విజ్ఞప్తి.. వీలైనంత త్వరలోనే ఫలితాలు: అధికారులు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీలలో 14 ఏండ్ల సంవత్సరాల తర్వాత జూనియర్ కాలేజీ లెక్చరర్ల పోస్టుల భర్తీకి రాత పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక కీ కూడా విడుదల చేసి, అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు కూడా స్వీకరించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యి దాదాపు ఐదు నెలలు గడిచింది. అయినప్పటికీ కూడా జూనియర్ లెక్చరర్ల భర్తీ ప్రక్రియ అడుగు ముందుకుపోవడం లేదని బాధిత జేఎల్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని సంప్రదించిన బాధిత అభ్యర్థులకు వారంలో ఫలితాలు విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. హెల్ప్‌లైన్ ద్వారా సంప్రదించిన కూడా ఇదే అంశాన్ని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జేఎల్ ఫలితాలు విడుదలపై టీఎస్‌పీఎస్సీ స్పష్టత ఇవ్వాలని కోరుతున్నట్టు జేఎల్ బాధిత అభ్యర్థి ప్రకాశ్ తెలిపారు.

సింగరేణిలో 6 నెలలు సమ్మెలు నిషేధం

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థలో సమ్మెలపై మరో ఆరు నెలలు నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఏఎం రిజ్వీ బుధవారం జీవో విడుదల చేశారు. సింగరేణి సంస్థ సీఎండీ వినతి మేరకు తెలంగాణ ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్ - 1971 ప్రకారం, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సమ్మెలపై నిషేధం విధించారు. మార్చి 11 నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

ప్రైవేటు బ్యాంక్ ఖాతాదారులే టార్గెట్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు ప్రైవేటు బ్యాంకుల ఖాతాదారులనే లక్ష్యంగా పెట్టుకుంటున్నారని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా సూచించారు. ముఖ్యంగా ఐసీఐసీఐ, ఎస్‌బ్యాంక్, ఆర్‌బీఎల్, ఇండస్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, ఏయూ స్మాల్ ఫైనాన్స్, పంజాబ్ నేషనల్ బ్యాంకుల ఖాతాదారులకు ఫోన్లు చేసి కోట్లల్లో కుచ్చుటోపీ పెడుతున్నారని తెలిపారు. సోషల్‌మీడియా సాయంతో ఏజెంట్లను నియమించుకొని ఖాతాల్లో ఎక్కువగా డబ్బున్న వారికి ఫోన్‌కాల్స్ చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ బ్యాంకుల ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ముఖ్యంగా చైనా, హాంకాంగ్, తైవాన్, థాయిలాండ్, కంబోడియా దేశాల ఐపీ అడ్రస్‌లను బ్లాక్ చేయాలని పేర్కొన్నారు.మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సజ్జనార్ ప్రజలకు సూచించారు.

ఏసీబీకి చిక్కిన గుండుమాల్ తహసీల్దార్

కోస్గి, మార్చి 27 : నారాయణపేట జిల్లా గుండుమాల్ తహసీల్దార్ పాండునాయక్ బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారి శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోగారం గ్రామానికి చెందిన రైతు మల్లేశ్ తన పొలం రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ పాండునాయక్‌ను కలువగా రూ.3 వేలు లంచం డిమాండ్ చేశాడు. వెంటనే అతడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. పథకం ప్రకారం బుధవారం మల్లేశ్ తహసీల్దార్ పాండునాయక్‌కు కార్యాలయంలోనే డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని, కేసు నమోదు చేశారు.

ఏసీబీ వలలో చిక్కిన పంచాయతీ కార్యదర్శి

మోత్కూరు, మార్చి 27 : సూర్యాపేట జిల్లా మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామ పంచాయతీ కార్యదర్శి రూ.3 వేల లంచం తీసుకొంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్ వివరాల ప్రకారం.. పొడిచేడు పంచాయతీ కార్యదర్శి చిన్నం కిరణ్ గ్రామానికి చెందిన గొరిగే మహేశ్ ఇంటి అనుమతికి రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడు. రెండేండ్ల క్రితం మహేశ్ రూ.5 వేలు ఇచ్చాడు. మరో రూ.3 వేలు కూడా ఇవ్వాలని కిరణ్ అడగడంతో మహేశ్ ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. బుధారం మహేశ్ బుధవారం పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కు రూ.3 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

అసమ్మతి నేతలకు రేవంత్ బుజ్జగింపులు

- మహేశ్‌కుమార్ ద్వారా వీహెచ్‌ను పిలిపించుకున్న సీఎం
- నిరంజన్‌తో దీపాదాస్‌మున్షీ, రోహిత్‌చౌదరి చర్చలు
- జడ్సన్‌కు నచ్చజెప్పేందుకు చిన్నారెడ్డి ప్రయత్నం
- దారికి రాకపోవడంతో క్రమశిక్షణ కమిటీ షోకాజ్

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో తన పట్ల రోజురోజుకు ముదురుతున్న అసమ్మతికి ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు పీసీసీ అధినేత, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి కేంద్రీకరించారు. ఎంపీ అభ్యర్థుల ఖరారులో బిజీగా ఉన్నప్పటికీ, అసమ్మతి నేతలను బుజ్జగించడానికి సమయం కేటాయిస్తున్నారు. ప్రభుత్వంలో తాను వన్‌మ్యాన్ షో చేస్తున్నారన్న విమర్శలు, ఎంపీ అభ్యర్థుల ఎంపిక తీరుపై సీనియర్ల నిరసన గళం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో మంత్రుల మధ్య విభేదాలు, అధిష్ఠానానికి అందుతున్న ఫిర్యాదులు వెరసి సీఎం రేవంత్‌రెడ్డికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పరిస్థితి చేయి దాటక ముందే ఆదిలోనే అసమ్మతిని ఆరికట్టేందుకు రేవంత్ దృష్టి సారించారు. పార్టీని నమ్ముకున్న వారికి కాకుండా ఇతర పార్టీల వారికి ఎంపీ టికెట్లు ఇవ్వడాన్ని సీనియర్ నేతలు నిరంజన్, వీ హనుమంతరావు తీవ్రంగా తప్పుబట్టారు. ముందు నుంచి పార్టీనే నమ్ముకున్నవారికి అన్యాయం చేయొద్దని సీఎం రేవంత్‌రెడ్డిని కలవాలనుకున్నా, తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని వీహెచ్ వ్యక్తంచేసిన ఆవేదన పార్టీలో కలకలం సృష్టించింది. దీంతో అప్రమత్తమైన రేవంత్‌రెడ్డి.. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ద్వారా బుధవారం తన ఇంటికి పిలిపించుకున్నారు. సీనియర్ నేతగా మీ పట్ల (వీహెచ్) తనకు గౌరవం ఉన్నదని, అయితే అత్యధిక ఎంపీ సీట్లను గెలిపించుకొచ్చే బాధ్యతను అధిష్ఠానం మోపడంతో గెలుపుగుర్రాలకు ప్రాధాన్యం ఇవ్వకతప్పలేదని రేవంత్‌రెడ్డి వివరించినట్టు తెలిసింది. భవిష్యత్తులో మీకు (వీహెచ్)కు సముచిత గౌరవం కల్పించే బాధ్యత నాదేనని, బుజ్జగించినట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో బీసీలకు సముచిత గౌరవం దక్కడం లేదని, ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని వీహెచ్ విజ్ఞప్తి చేశారని సమాచారం. అభ్యర్థుల ఎంపిక ఎన్నికల కమిటీ చూసుకుంటుందని, తాను కేవలం అభిప్రాయం మాత్రమే చెప్పగలనని రేవంత్‌రెడ్డి స్పష్టంచేసినట్టు తెలిసింది.

బక్క జడ్సన్‌కు షోకాజ్

సామాజిక వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అభియోగంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ బుధవారం పార్టీ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్‌కు షోకాజు నోటీసు జారీ చేసింది. దీనికి మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని గడువు విధించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్‌రెడ్డి తన సామాజికవర్గానికే పదవులు కట్టబెడుతున్నారని సామాజిక మాధ్యమాల్లో జడ్సన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి రెండు రోజుల క్రితం జడ్సన్‌ను తన వద్దకు పిలిపించుకొని సీఎం రేవంత్‌రెడ్డిపై ఇకనుంచి ఎలాంటి విమర్శలు చేయొద్దని కోరినట్టు తెలిసింది. ప్రభ